మబ్బు పట్టిన సాయంకాలపు వేళ చూస్తుండగానే చీకట్లు కమ్ముకున్నాయి.

పవర్‌కట్ మూలంగా అంతవరకూ దేదీప్యమానంగా ప్రకాశించిన బజారు బేజారయిపోయింది.

డొల్లలాగ ఉన్న ఆ ఖాళీ సాయంత్రం .. తన కొండచిలువ రూపాన్ని తీసిపారేసి ఆనందరావు కసిగా ... నిస్సహాయంగా ... చీకటి బజారులోంచి మొదలు పెట్టాడు. ఆకాశంలో గాఢంగా కమ్మిన మబ్బులు తన జీవితానికే పట్టినట్టు అతని కనిపించింది.

ఆనందరావు ఆవేశంగా శవంలాంటి ఆ సాయంకాలాన్ని

ఒక్క తన్ను తన్నాడు.

ఇత్తడి పళ్ళెంలోకి కాటుక పట్టినట్టు అంతటా అంధకారమే.


చీకట్లో రోడ్లవెంట ఆనందరావు అగమ్యంగా నడవడం కొనసాగించాడు. వరసగా ఒకదాని పక్కన మరోటి.. నిలుచున్న షాపులూ .. షాపింగ్ కాంప్లెక్సులూ నోళ్ళు తెరిచిన కొండచిలువల్లాగ ఉన్నాయి!

ఆనందరావుకి అనుమానం వచ్చింది. అసలు తను బజారులోంచి నడుస్తున్నాడా? లేక కొండచిలువల ప్రదర్శనశాలలో ఉన్నాడా? కొండచిలువలన్నీ రోడ్డుకి రెండు వైపులా నాల్కలు సాచి ఉన్నాయి. ఆ నాల్కలు మేగ్నెట్లలా రోడ్ల మీది జనాన్ని ఆకర్షిస్తున్నాయి. అంత కారు చీకట్లోనూ గుండు సూదుల్లాంటి.. పిన్నీసుల్లాంటి తేలిక జనమంతా... అవసరం కొద్దీ ఇట్టే 'మేగ్నెట్లకి' అతుక్కుపోతున్నారు! తన 'మేగ్నెట్' నాల్కకి అతుక్కున్న వాళ్ళని కొండచిలువ అమాంతం మింగేస్తోంది. అట్లా జనాన్ని మింగీ... మింగీ.. పొద్దుటే అది - ఏ ఇనప్పెట్టెకో ... బేంక్ చెట్టుకో చుట్టుకుని, మొత్తం జీర్ణించుకుని.. మళ్ళా నోరు తెరిచి పెడుతుంది!

ఆనందరావుకి అసలు కొండచిలువలంటేనే అసహ్యం! కానీ, అన్నీ తను కోరుకున్నట్టే ఎందుకు జరగాలి? తను ఏ రూపాన్నయితే అసహ్యించు కున్నాడో... అదే కొండ చిలువ అవతారం ఎత్తవలసి వచ్చింది.

ఆనందరావు కొండచిలువగా మారిపోయే శాపాన్ని పొందాడు!

అతను .. జీవితంలో ఓడిపోయాడు. ఘోరంగా దెబ్బతినేశాడు. భయంకరంగా అణిగిపోయాడు. చిన్నప్పట్నుంచీ ఆనందరావుకి ఓడిపోవడమే తెలిసిన విద్య! ఊహ



తెలిసీ, తెలియని స్థితి నుంచే ఓటమి అతన్ని వేటాడ్డం మొదలెట్టింది. తనని అస్తిమితం చేసి తరిమికొట్టింది.

నిజానికి ఓటమి - ఒక 'తోలుబెల్టు' రూపంలో

ఆనందరావుని వెంటాడింది!

చివరికి .. ఒక కొండచిలువగా శపించి పారేసింది.

జీవితం ఆటలో ఓడిపోయి ... ఓడిపోయి... డొల్లలాంటి ఆ సాయంత్రపు ముసుర్లో తనని తానే తవ్వుకోవడం మొదలెట్టాడు.

తనకసలు విజయాలే లేవా? తనెందుకు ఓడిపోవాలి? అసలు తనెప్పట్నుంచీ ఓడిపోవడం మొదలెట్టాడూ? ఎంతదాకా ఇట్లా ఓడిపోతాడూ?

ఆనందరావు తన జీవితం మట్టిని కసిగా తవ్వడం మొదలెట్టాడు.

అట్లా తవ్వుతూంటే.. అతనికి గోదావరి కనిపించింది. ఆనందరావుకి గోదావరంటే చాలా ఇష్టం. ఇష్టం ఏవిటీ? గోదావరితో తనకి ప్రాణ స్నేహం. తను రోజూ గోదావరి గట్టుకి వెళ్ళేవాడు.

అప్పుడు ఆనందరావుకి ఏడేళ్ళుంటాయి.

గోదావరి ఆనందరావుని ఆడించేది. దగ్గిరికి తీసుకునేది. పడవల ఉయ్యాల లెక్కించేది. స్నానం చేయించేది. నిప్పుల బంతిలాగ ఉండే సూర్యుడు సాయంత్రపు వేళ పడమర దిక్కు వైపు మునిగిపోతూంటే అతనికి భలే ఆశ్చర్యం అనిపించేది.

“సాయంత్రం గోదాట్లో మునిగాడు కనకే పొద్దున్నే సూర్యుడు వేడిగా ఉండడు!” అంటూ స్నేహితుల్తో వాదించేవాడు.

ఒకరోజు ఎప్పట్లాగే గోదావరితో ఆడుకునేందుకు వెళ్ళాడు ఆనందరావు. ఆమె ఒడ్డున ఆడీ.. ఆడీ... అలిసిపోయి, తనని తానే మరిచిపోయాడు. ఉద్రేకంగా నీళ్ళల్లోకి దిగి గెంతులేశాడు.

ఆ వేళ గోదావరికి ఆనందరావుమీద ప్రేమ ఎక్కువయ్యిందేమో!

ఒక్క ఉదుట్న అతన్ని లోపలికి ... తన లోపలికి లాక్కుని ముద్దెట్టుకుంది! తల్లి గర్భగుడిలోకి ప్రవేశించినట్టు అతను ఆమె 'వాడి' లోకి వెళ్ళిపోయాడు! కానీ, ఆమె ప్రేమని తట్టు కోలేక పోయాడు. ఉక్కిరిబిక్కిరై పోయాడు.

అంతలో ఎవరో పడవవాళ్ళు ఆనంద



# మబ్బుపట్టిన కాలంలోంచి...

యమ్మెస్. సూర్యనారాయణ

రావుని ఒడ్డుకి చేర్చారు.

ఆ తరవాత ఇంటికి చేర్చారు.

ఆనందరావు తల్లి - కొడుకుని పట్టుకుని కౌగలించుకుని భోరుమంది. అచ్చు గోదాట్లో మునిగినప్పుడెంత హాయిగా అనిపించిందో అమ్మ కౌగలించుకున్నప్పుడూ అట్లానే అనిపించింది.

అదిగో! అప్పుడు 'తోలుబెల్టు' రంగ ప్రవేశం చేసింది.

'తోలుబెల్టు' అంతకు ముందే డ్యూటీ దిగింది.

జరిగిన సంగతంతా 'పెళ్ళాం' దగ్గర్నుంచి రాబట్టింది.

ఫలితంగా - ఆనందరావు వొంటిమీద 'తోలుబెల్టు' నాట్యం చేసింది.

ఏడేళ్ళ బాల్యం మీద 'తోలుబెల్టు' ప్రేమగా రక్తపు మరకలు అంటించింది. అది భయానకంగా హూంకరించింది.

"వెడతావా ఎప్పుడైనా? గోదావరి దగ్గరికి వెడతావా? చెప్పరా!"

అంటో గర్జించింది.

గోదావరంటే ప్రాణమైనా సరే - తన ఇష్టానికి వ్యతిరేకంగా -

"గోదావరితో స్నేహం చెయ్యను" అని అబద్ధం చెప్పాడు.

తనకి కావలసిన సమాధానం రాబట్టాక తోలుబెల్టు తృప్తిగా ..

పాములాగ ... ఫేంటురింగుల్లోకి ముడుచుకుంది.

ఆ తరవాత - తోలుబెల్టు .. ఆనంద రావునీ, అతని బాల్యాన్నీ గోదావరి పేరు కూడా వినపడనంత దూరానికి పంపించేసింది.

గోదావరికీ... అమ్మకీ.... దూరంగా ఎక్కడో పరాయి చోట ఉండాల్సి రావడం ఆనందరావుకి చాలా బెంగ అనిపించేది. ఎలాగైనా గోదావరి దగ్గరికెళ్ళాలనిపించేది. కానీ ఎలా?

రాత్రిళ్ళు... కలల పట్టాల మీద కూత పెట్టే ఆశల రైలెక్కి తనకి ప్రాణమైన రాజమండ్రీ స్టేషన్‌లో దిగి ... తిన్నగా గోదావరి ఒడ్డుకు వెళ్ళిపోయేవాడు.

గోదావరి... విశ్వేశ్వరుడి గుడి ... త్యాగరాజోత్సవాలూ....

బాలమురళీ ... చిట్టిబాబు ... దేవీ నవరాత్రులూ ... నాటకాలూ.... స్నేహితులూ ... ఆటలూ ... రాజమండ్రీ రోడ్ల సర్వే!

అంతా తెల్లవారే సరికి పూర్తయి పోయేది.

ఆ అందమైన కల తర్వాత, తెల్లవారగట్ల మరో పీడకల వచ్చి తీరేది! అది - తోలుబెల్టు కల! తోలుబెల్టు ... ఆనందరావు భయపడే ... అతను అసహ్యించుకునే పాములాగ బుస కొడుతూ కనిపించేది!

తోలుబెల్టు ఆనందరావుని చూసి ప్రేమగా నవ్వేది. ఒక్కోసారి

సుతిమెత్తగా చుట్టేసేది!

అటువంటప్పుడు అతనికి గగుర్పాటు కలిగేది! అతను తోలుబెల్టుకి సాష్టాంగపడి, అది చెప్పినట్టే నడుచుకునేవాడెప్పుడూ. నిజానికి అతనికంటూ ఏమీ ఆలోచనలుండేవి కావు. ఎల్లప్పుడూ బెల్టుని తల్చుకుని.. వొణికిపోయి.. అస్థిరంగా.. నంగిరి నంగిరిగా.. అతని అడుగులు పడేవి.

అడుగుతీసి అడుగు వెయ్యాలంటే భయంగా ఉండేది. స్లో పాయిజన్‌లాగ ఓటమి అతని మీద పనిచెయ్యడం మొదలెట్టింది. తనేం చేసినా సరే - ఓడిపోతాననే భయం కర్కశంగా ప్రభావం చూపించింది.

భయంకరమైన డిప్రెషన్. కల్తీ సరంజామాతో కట్టిన అవుకు కట్టడంలా ఆనందరావు! అతని బాల్యం కాస్తా కరిగి .. యవ్వనమంతా వృధాగా... ప్రయాసగా మారి ... జీవితం ముదిరింది.

"పాపం! తోలుబెల్టుకి వీడొక్కడే!" అనేది ప్రపంచం.

బెల్టు ఆనందరావుకోసం శ్రమించి ఎన్నో పథకాలు రచించేది. అవన్నీ కేవలం తోలువాసనతో కర్కశంగా ఉంటూండేవి.

తోలువాసన పీల్చీ... పీల్చీ.. ఆనందరావు విషాదరావుగా మారిపోయాడు. చిన్నప్పట్నుంచీ ... పోలియోడ్రాప్స్ మారుగా అతని దేహంలోకి ఓటమి ప్రవేశించింది.

టీకాలాగ ఓటమి ఆనందరావు జబ్బ మీద మచ్చయ్యింది.

ఆనందరావు శపించబడ్డాడు.

తను ఏ రూపాన్నయితే అసహ్యించుకున్నాడో.. ఏ రూపం తనకు ఫోబియానో.. ఆ కొండచిలువగా మారిపోయాడు.

కాదు.. మార్చబడ్డాడు!! అదే తోలుబెల్టు ఇంద్రజాలం! కానీ - కొండ చిలువ రూపం ఒక తొడుగులా మాత్రమే అతనికి అమిరింది!

తను నిజమైన కొండచిలువని కాననీ.. ఎప్పటికీ కాలేననీ.. ఏ శాపాలూ .. ఇంద్రజాలాలూ పనిచేయవనీ తెలుసుకుని.. కనిపించే కొండచిలువ తొడుగునీ.. కనిపించని అనేకమైన తొడుగుల్నీ ఆనందరావు తీసిపారేశాడు!

తనేమిటో తెలుసుకునే అన్వేషణలో.. డొల్లలాగ ఉన్న ఆ సాయంకాలం తనని తానే తవ్వుకోవడం మొదలెట్టాడు ఆనందరావు.

ఎంత తవ్వినా అంతు దొరకడం లేదు. గతం అంతా కర్కశమైన శాసనాలూ.. ఆజ్ఞలే కనిపిస్తున్నాయి. ఎందుకూ పనికిరాని, వ్యక్తిత్వంలేని ఓటమే కనిపిస్తోంది.

"నేను ఓడిపోయిన మనిషినా? నా అస్తిత్వం పూర్తిగా కోల్పోయానా? ఓటమి నన్నిలా వెంటాడుతూనే ఉంటుందా?.."

అట్లా ప్రశ్నలు గునపాలతో తనను తానే తవ్వుకుంటూండగా అదిగో! అప్పుడు మేలుకుంది ఆనందరావు వివేకం.

అతని తవ్వకానికి ఒక మార్గం చూపించిందది.

మెరుపులాగ.. ఒక వివేకవంతమైన ప్రశ్న లోతుగా... ఆ డొల్లలాంటి సాయంకాలాన్ని తవ్వింది.

"నేను అమ్మ కడుపులో ఉన్నప్పుడు.. ఆ తొమ్మిది నెలలూ.... ఓడిపోయానా? లేదే! ఊహ తెలిసేంత వరకూ నేను విజేతనే కదా?"

"అవును. ఇప్పుడు ఆ పురాతన బాల్య స్మృతే ... అమ్మ రొమ్ము కుడిచినప్పటి ఆ క్షీరసాగర విజయమే ఇప్పుడు నాకు స్ఫూర్తి' ' అనిపించింది ఆనందరావుకి.

మబ్బుపట్టిన కాలంలోంచి.. అతను మళ్ళీ పుట్టాడు!

గుండ్రటి... గుల్లలాంటి బంతిలోంచి ఎట్నుంచి తవ్వినా, మళ్ళీ మొదటికే రావాలి!

చిన్నపిల్లాడు కాలిబొటనవేలు నోట్లో పెట్టుకున్నట్టు...

ఆనందరావు మొదటికే వచ్చాడు.

ఓటమికీ, గెలుపుకీ మధ్య... గుండ్రటి బంతిలోంచి తవ్వకంలోంచి .. తలెత్తి -

ఆ చీకట్లో నమ్మకంగా అడుగులేశాడు ఆనందరావు!

అవరోధాలకి వ్యతిరేకంగా, స్వతంత్రంగా! ●

